
సాక్షి ప్రకాశం

శుక్రవారం । 5 । జూలై । 2024



కంభంలో ఘోర రోడ్డు ప్రమాదం

కంభంలో రెండు ద్విచక్రవాహనాలను కారు ఢీకొట్టింది. ఒకరు మృతి చెందగా, ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. - 8లో..



మార్కాపురానికి తాగునీటి ముప్పు

దూపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు మరో వారం రోజుల్లో ఖాళీ కానుంది. దీంతో మార్కాపురం పట్టణానికి తాగునీటి ముప్పు పొంచి ఉంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
37/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన బాలల సంక్షేమ కమిటీ చైర్మన్



కలెక్టర్‌ను కలిసి మొక్క అందజేస్తున్న బాలల సంక్షేమ కమిటీ చైర్మన్

ఒంగోల అర్బన్: కలెక్టర్ తమీమ్ అన్సారియాను గురువారం బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వేము రామాంజనేయులు మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. జువైనల్ జస్టిస్ యాక్ట్-2015, రోల్ మోడల్-2016, వాత్సల్య మిషన్ గైడ్‌లైన్స్-2023, పిల్లల రక్షణ, సంరక్షణ, పునరావాసం, సంక్షేమం, దత్తత ప్రక్రియ, పోస్టర్ కేర్ బెంచ్‌లో చేసే కార్యక్రమాల గురించి కలెక్టర్‌కు రామాంజనేయులు వివరించారు.

గురుకులాల్లో మిగిలిన సీట్లు భర్తీ చేయాలి



సమీక్షలో పాల్గొన్న మంత్రి డోలా

ఒంగోలు సెంట్రల్: రాష్ట్రవ్యాప్తంగా బాలయోగి గురుకుల కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఇంటర్మీడియెట్ సీట్లను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. బాలయోగి గురుకుల పాఠశాలల అధికారులు, ప్రిన్సిపాళ్లతో గురువారం ఒంగోలులో మంత్రి సమీక్షించారు. గురుకులాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆయా వసతి గృహాల్లోని సౌకర్యాలపై సమీక్షించారు. త్వరలోనే అన్ని గురుకులాల్లో సోలార్ ద్వారా వేడినీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల బంగారు జీవితాలకు నిలయమైన గురుకులాల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించబోమని అన్నారు.

రేపు రేబిస్ టీకాలు వేయించండి

- జిల్లా పశుసంవర్థక శాఖాధికారి బేబీరాణి

ఒంగోలు సెంట్రల్: జూనోసిస్ డే సందర్భంగా ఈ నెల 6వ తేదీ ఒంగోలు సంతపేటలోని పశువైద్యశాలతో పాటు జిల్లాలోని అన్ని పశువైద్య కేంద్రాల్లో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేయనున్నట్లు జిల్లా పశుసంవర్థక శాఖాధికారి కె.బేబీ రాణి తెలిపారు. అందుకోసం జిల్లాకు 32,230 డోసుల రేబిస్ వ్యాక్సిన్లు వచ్చినట్లు వెల్లడించారు. పశుపక్ష్యాదుల నుంచి మనుషులకు సక్రమించే జూనోటిక్ వ్యాధుల్లో రేబిస్ వ్యాధి ప్రధానమైనదని, దీనిపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలతో దేశ ఆర్థిక వ్యవస్థపై పెనుభారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు సెంట్రల్: రోడ్డు ప్రమాదాలతో దేశ ఆర్థిక వ్యవస్థపై పెనుభారం పడటమే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నం అవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి అన్నారు. హైకోర్టు సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయ సేవాధికార సంస్థలతో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సేవా సహాయకుల సహకారంతో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి భారతి మాట్లాడుతూ మోటారు వాహనంపై ప్రయాణించే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ చేసే వ్యక్తితో పాటు వెనుకున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని చెప్పారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 3,703 రోడ్డు ప్రమాదాలలో 3,042 మంది మరణించడం దురదృష్టకరమని అన్నారు. ప్రతి వ్యక్తి తాను డ్రైవింగ్ చేసేటప్పుడు తనను నమ్ముకుని ఉన్న కుటుంబాన్ని గుర్తుంచుకుని ప్రమాద రహితంగా వాహనాలు నడపాలని కోరారు.

ప్రణాళిక లేని పెకలింపు



కనిగిరిలో అధికారులు ధ్వంసం చేసిన బంకులు

కనిగిరి పట్టణం ఘొల్లుమంది.. నాలుగు దశాబ్దాలుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న బడుగులపై పాలకులు ఉక్కుపాదం మోపారు. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా పదికాదు.. ఇరవై కాదు.. ఏకంగా వందలాది దుకాణాలను నేలమట్టం చేశారు. తమ దుకాణాలను కూల్చొద్దంటూ వేడుకుంటున్నా కనీస కనికరం చూపకుండా కూల్చేశారు. బుధవారం తెల్లవారు జాము నుంచి రాత్రి వరకూ జేసీబీలతో అధికారులు పట్టణంలో భయానక వాతావరణాన్ని సృష్టించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో రెక్కాడితేగానీ డొక్కాడని బడుగు జీవులపై అధికారులు, పాలకపక్షం కర్కశంగా వ్యవహరించిన తీరుపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణాభివృద్ధికి ప్రణాళికా బద్ధమైన చర్యలతో ముందడుగు వేయాల్సిన అధికారులు కక్షపూరితంగా వ్యవహరించిన తీరుపై ఇటు వీధివ్యాపారులు, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

'అధికార' దౌర్జన్యానికి అభాగ్యుల జీవితాలు బలి

- బైపాస్ నిర్మాణాన్ని వదిలేసి అభివృద్ధి మాటున ఉన్మాదం
- కనిగిరిలో దుకాణాల కూల్చివేతతో వీధిన పడిన వందలాది చిరువ్యాపారులు
- జీవనభృతి కోల్పోయి.. ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూపులు
- ఉపాధి పోరాటానికి సంఘటితమవుతున్న వీధి వ్యాపారులు
- ప్రత్యామ్నాయం చూపేంత వరకు పోరాటం చేస్తామన్న ప్రజాసంఘాల ఐక్యవేదిక

కనిగిరి రూరల్: వారంతా బడుగు బలహీన, దళిత, మైనార్టీ వర్గాలకు చెందిన వారు. చెప్పులు అమ్ముకుంటూ, వాచీలు రిపేరు చేసుకుంటూ, చికెన్ పకోడి అమ్ముకుంటూ, మంగళి షాపులు నిర్వహించుకుంటూ, పూలు, పండ్లు అమ్ముకుంటూ, ఇడ్లీ, దోసలు అమ్ముకుంటూ, కూల్ డ్రింక్ షాపులు, గాజుల షాపులు పెట్టుకుని అనేక రకాల వ్యాపారులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరిలో రోజువారీ వడ్డీలకు, నెలవారీ వడ్డీలకు డబ్బులు రొక్కం తీసుకుని జీవించే వారే అధికం. వీరిలో కొందరు మైనార్టీ రుణాలు, ముద్ర రుణాలు తీసుకుని నెలనెలా బ్యాంకులకు కంతులు కడుతున్నారు. కానీ, ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా పోలీసుల బందోబస్తు, జేసీబీలతో వీరి దుకాణాలను నేలమట్టం చేశారు. అధికారుల కక్ష పూరిత వైఖరి కారణంగా కనిగిరి పట్టణంలో సుమారు 500 కుటుంబాలు వీధిన పడ్డాయి. మాపై ఎందుకీ కక్ష అంటూ కన్నీరు పెడుతూ అధికార, పాలకవర్గాల నేతలకు శాపనార్థాలు పెడుతున్నారు. చెప్పుల బజార్‌లో నివసిస్తున్న ఫుట్‌పాత్ బంకుల వారితోనైనా మున్సిపాలిటీ వారు రెండు సార్లు చర్చలు చేశారు. కానీ, పట్టణంలో మిగతా రోడ్లపై జీవిస్తున్న వీధికార్మికులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా పోలీస్ సిబ్బంది పహారాతో మున్సిపల్ కమిషనర్ పొక్లెయిన్లు, డోజర్లు పెట్టి కొట్టడం దుర్మార్గమైన చర్యగా ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి.

ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూపులు..!

ఒక్కసారిగా చేపట్టిన బంకుల తొలగింపు చర్యలతో ప్రతి షాపునకు సుమారు రూ.20 వేల నుంచి రూ.50 వేలకుపైగా నష్టం జరిగింది. అంతేగాకుండా దుకాణాలు లేకపోవడంతో అనేక కుటుంబాలు జీవనభృతి కోల్పోయాయి. వీధి వ్యాపారుల్లో ఎక్కువ మంది ముస్లిం మైనార్టీలు, బీసీలు, దళితులు ఉన్నారు. వీరంతా ఏరోజుకారోజు పొట్టనింపుకునే వారే కావడంతో ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు ప్రకటనలు చేస్తున్న అధికార పార్టీ నేతలు.. కనీసం ఆ దిశగా తొలి అడుగు కూడా వేయలేదు. బహిరంగ అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో వీధి వ్యాపారులు న్యాయం కోసం దిక్కుతోచని స్థితిలో ఎదురు చూస్తున్నారు.

పోరాటానికి సంఘటితం...

వీధి వ్యాపారుల జీవన ఉపాధి పోరాటానికి, ప్రత్యామ్నాయం కోసం ప్రజాసంఘాలు, బీసీ సంఘాలు, ప్రతిపక్షాలు, వామపక్షాలు, కార్మిక సంఘాలతో కలిసి సంఘటిత పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆ మేరకు వీధి వ్యాపారుల సంఘం, సీఐటీయూ, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తొలుత కలెక్టర్, ఆర్డీఓ, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసి ఆ తర్వాత ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుడుతున్నారు. ఈ క్రమంలో వీధివ్యాపారులతో వివిధ సంఘాల నాయకులు గురువారం సమావేశం నిర్వహించుకున్నారు.

అభివృద్ధికి ఓకే.. ప్రణాళికా బద్ధమైన చర్యలేవీ..?

అధికారులు, పాలకపక్ష నేతలు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, పట్టణ అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామని.. అందులో భాగంగానే రోడ్ల విస్తరణ, బంకుల తొలగింపు చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్నారు. అయితే ఆ క్రమంలో ప్రజా ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా, నిబంధనలను తుంగలో తొక్కి తెల్లవారుజాము నుంచి పోలీసు బలగాలను దింపి అధికార ధమనకాండ సృష్టించాల్సిన అవసరం లేదు. వీధి విక్రేత వ్యాపారుల చట్టప్రకారం రోడ్లపై వ్యాపారం చేసుకుని జీవించే పేద వర్గాల వారికి గుర్తింపు కార్డులిచ్చి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో వసతులు కల్పించి.. ఆ తర్వాతే తొలగింపు చర్యలు చేపట్టాలి. మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్న వీధి వ్యాపారులకు కనీసం నోటీసులైన ఇవ్వాలి. ఇవేమీ చేయకుండా అధికార నియంతగా మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు చేపట్టిన చర్యలు ముమ్మాటికీ దౌర్జన్యకాండగానే ప్రజలు విమర్శిస్తున్నారు. కనిగిరి బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెబుతున్న పాలకులు ఆ దిశగా తొలి అడుగులు వేసి ఉంటే.. కనిగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు కొంత మేర చెక్ పడుతుంది.

అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల్లో విస్తరణ పనులు చేపట్టి వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి బంకులు తొలగించి ఉంటే.. ఇటు బడుగు జీవులకు, అటు అభివృద్ధి బాటకు సమాన అడుగులు పడేవి. పట్టణ ప్రజలు హర్షించే వారు. కానీ, చిరువ్యాపారులపై అధికారులు వ్యవహరించిన తీరు ప్రజామోదం కంటే.. ప్రజా ఖేదాన్నే మూటకట్టుకుందనడంలో ఎటువంటి సందేహం లేదు.





కనిగిరిలో అధికారులు ధ్వంసం చేసిన బంకులు



ర్యాలీ నిర్వహిస్తున్న చిరు వ్యాపారులు (ఫైల్)

నేను క్యాన్సర్ పేషెంట్‌ని.. నా దుకాణం పగులకొట్టవద్దని కమిషనర్‌ను వేడుకున్నా



నేను సుమారు 30 ఏళ్ల నుంచి చెప్పుల బజారులో చెప్పుల కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. కనిగిరి పంచాయతీగా ఉన్నప్పటి నుంచి బంకు పన్ను కడుతున్నా. ప్రస్తుతం కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదు. నేను క్యాన్సర్ పేషెంట్‌ని. నా దుకాణం పగలకొట్టవద్దని తెల్లవారుజామున 5 గంటలకు వెళ్లి కమిషనర్ ముందు కన్నీరు పెట్టుకుని నేను, నా భార్య వేడుకున్నాం. అయినా కనికరం చూపకుండా పోలీసు బలగాలను పెట్టి నా బంకు ధ్వంసం చేశారు. ఇటీవల రూ.80 వేలు పెట్టి బంకు రిపేరు చేయించుకున్నా. ఒక్కసారిగా పగులకొట్టారు. నా చేతిలో చిల్లి గవ్వలేదు. ప్రతి నెలా రూ.3 వేలు కట్టి విజయవాడ ఓమెగా క్యాన్సర్ ఆస్పత్రి నుంచి మందులు తెచ్చుకోవాలి. నా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. నాకు ఏదైనా జరిగితే ఆ పాపం కమిషనర్, పాలకులే మూటకట్టుకోవాలి.

– ఎస్‌కే పీర్ల గౌస్ మొహిద్దీన్

కమిషనర్‌కు పేదలంటే కక్ష.. కళ్ల ముందే బంకు ధ్వంసం చేశారు



నా బంకులో టైలరింగ్ చేసుకుంటూ.. పండ్లు అమ్ముకుంటూ జీవిస్తున్నా. కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రి వచ్చి కళ్ల ముందే బంకును ధ్వంసం చేశారు. కమిషనర్ కనీసం కనికరం చూపలేదు. 35 ఏళ్ల నుంచి అక్కడే బంకు పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. పంచాయతీగా ఉన్నప్పటి నుంచి పన్ను కూడా కడుతున్నా. కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా జీవనాధారం తీసేశారు. మా లాంటి బడుగు జీవులపై కమిషనర్‌కు ఎందుకు అంత కక్ష అనేది అర్థం కావడం లేదు. కనీసం ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలి.

– ఎస్‌కే ఉప్పలపాటి మునాఫ్

అధికారులపై చర్యలు తీసుకోవాలి



అధికార పార్టీ నేతల మెప్పు కోసం బడుగు జీవులపై కక్ష సాధింపు చర్యగా వీధి వ్యాపారుల దుకాణాలను ధ్వంసం చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కమిషనర్ నిబంధనలు తొంగలో తొక్కి ఇష్టానురీతిగా వ్యవహరించారు. కమిషనర్ అధికారిలా కాకుండా నియంతలా వ్యవహరిస్తున్నారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా బంకులను ధ్వంసం చేసి వీధివ్యాపారుల జీవితాలు రోడ్డున వేయడం దారుణం. వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపేంత వరకు అన్ని సంఘాలతో కలిసి పోరాటం చేస్తాం.

– ఎస్‌కే బషీరా

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న ఎస్పీ సుమిత్ సునీల్

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు



కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఒంగోలు సెంట్రల్: అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యులను చేసి సమ్మిళిత అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకుని స్థానిక గిరిజన భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యం కోసం, గిరిజనుల హక్కుల కోసం అల్లూరి సీతారామరాజు అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో జిల్లాలోని గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ప్రకటించారు. గిరిజనుల ఆరోగ్యం, విద్య, నైపుణ్యాల అభివృద్ధితో పాటు మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ఆ దిశగా సమర్థవంతంగా అమలు చేస్తానన్నారు. చదువుకు దూరమైన గిరిజన బిడ్డలు తిరిగి పాఠశాలలకు వెళ్లేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ప్రీ మెట్రిక్ గిరిజన హాస్టల్ ఏర్పాటుతో పాటు జిల్లాలోని గిరిజన వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు. అందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తానన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అందులో పాల్గొన్న విద్యార్థులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా బహుమతులు ప్రదానం చేశారు. ముందుగా స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అంజల, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, మైనార్టీ సంక్షేమ అధికారి నారాయణ, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి, ఇతర అధికారులు, పలు సంఘాల నాయకులు పేదరం సత్యనారాయణ, ఈగా శ్రీనివాసరావు, భూమని మంతన్న, రమావత్ సైదానాయక్, రావూరి శ్రీను, శ్రీరామ శ్రీను, యకసరి అంజిబాబు, చలంచర్ల ప్రసాద్, మానికల గోపాలకృష్ణ, పత్లావత్ రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తి రగిలించిన విప్లవజ్యోతి.. అల్లూరి

- ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్: పరిమిత వనరులతో బ్రిటీష్ మహాసామ్రాజ్యాన్ని ఢీకొట్టిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు దేశ స్వాతంత్ర్య పోరాటంలో యువతలో స్ఫూర్తి రగిలించారని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ కొనియాడారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన్యంలో అల్లూరి చేసిన సాయుధపోరాటం స్వాతంత్ర్య చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఆయన తిరుగుబాటు చేయడం అనేకమందిని ప్రేరేపించిందని చెప్పారు. అల్లూరి అనే పేరే ప్రజా చైతన్యానికి నిదర్శనంగా నిలిచిందని చెప్పారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో 27 ఏళ్ల చిరుప్రాయంలోనే ప్రాణ త్యాగం చేసిన మహావీరుడిని స్మరించుకోవడం ద్వారా జాతికి పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, డీపీఓ ఏఓ సులోచన, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, డీసీఆర్బీ సీఐ బీమానాయక్, పీసీఆర్ సీఐ వెంకటేశ్వరరావు, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమేష్‌కృష్ణ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మలకు చెక్కు అందిస్తున్న జంకె వెంకటరెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి
- టీడీపీ, జనసేన దాడుల్లో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు చెక్కుల పంపిణీ



తాటిపర్తి చంద్రశేఖర్‌కు చెక్కు అందిస్తున్న జంకె వెంకటరెడ్డి

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ, జనసేన శ్రేణుల దాడుల్లో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటున్నట్లు తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం మేరకు తొలి విడతగా దర్శి, యర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలకు ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. సంబంధిత చెక్కులను గురువారం దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబుకు జంకె వెంకటరెడ్డి అందజేశారు.

8న మార్కాపురంలో కలెక్టర్ గ్రీవెన్స్

ఒంగోలు అర్బన్: కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీ మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. మార్కాపురంలోని ఏరియా హాస్పిటల్ వద్ద ఉన్న శ్రీనివాస కళ్యాణ మండపంలో కలెక్టర్ గ్రీవెన్స్ జరుగుతుందని వెల్లడించారు. జిల్లా అధికారులంతా హాజరవుతారని, ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

బ్యూటీ థెరపీలో శిక్షణ

ఒంగోలు టౌన్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె. రవితేజ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ లోపు ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాలలోని స్కిల్ హబ్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7842004344కు ఫోన్ ద్వారా సంప్రదించాల్సిందిగా కోరారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

● జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర

ఒంగోలు సెంట్రల్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయులు వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర కోరారు. ఈ నెల 15 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని కాపీని, రెండు సెట్ల ప్రతిపాదనలను సీడీలో 30 పేజీలకు మించకుండా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. వివరాలు సంబంధిత వెబ సైట్‌లో నమోదు చేసుకోవాలని డీఈఓ కోరారు.

గంజాయి తరలిస్తున్న ఆరుగురు అరెస్ట్



గంజాయి, నిందితులను చూపిస్తున్న చింతూరు పోలీసులు

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఒడిశా నుంచి తెలంగాణకు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఆరుగురు నిందితులను గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెండు కార్లను ఆపి సోదాలు చేయగా, వాటిలో వంద కిలోల గంజాయి లభ్యమైంది. నలుగురు వ్యక్తులను, ద్విచక్ర వాహనంపై వచ్చిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి రవాణాకు పాల్పడుతున్న తెలంగాణకు చెందిన హపవత్ రమేష్, జాటోతు రవీందర్, ఒడిశాకు చెందిన మరిగెల వెంకట్రావు, మరిగెల సత్తిరెడ్డి, మరిగెల చంటిబాబు, ప్రకాశం జిల్లాకు చెందిన మాదాల వెంకటేశ్వరరావును అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.40 లక్షలు ఉంటుందన్నారు.

అంతర రాష్ట్ర సెల్ దొంగకు బేడీలు

చీరాల రూరల్: అంతర రాష్ట్ర దొంగను చీరాల జీఆర్పీ పోలీసులు గురువారం అరెస్టు చేసి నిందితుడిని కటకటాల వెనక్కు నెట్టారు. గురువారం రైల్వే డిప్యూటీ సూపరింటెండెంట్ సీహెచ్ విజయ భాస్కర్, ఎస్సై కొండయ్య వివరాలు వెల్లడించారు. ఒంగోలు జీఆర్పీ సీఐ ఎస్. శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో చీరాల జీఆర్పీ ఎస్సై సిహెచ్. కొండయ్య గురువారం చీరాల నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇల్లూరు హరినాథ్‌ని అదుపులోకి తీసుసుకుని తనిఖీలు చేయగా అతని వద్ద ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై సి.హెచ్. కొండయ్య, హెచ్‌కానిస్టేబుల్ కె. భాస్కరరావు, కానిస్టేబుళ్లు రాము, గోపిలను రైల్వే అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్ అభినందించారు. కడప జిల్లాకు చెందిన నిందితుడు ఇంజనీరింగ్ చదువుకుని ఉద్యోగం లేక ఖాళీగా తిరుగుతూ వ్యసనాలకు, మద్యానికి, ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి దొంగగా మారాడు.



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు, ద్విచక్రవాహనం



మృతుడు సోముల సుబ్బారెడ్డి (ఫైల్)

సంఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహం

కంభంలో ఘోర రోడ్డు ప్రమాదం

● రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన కారు
● ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు



సంఘటనా స్థలంలో ఉన్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా



వైద్యశాలలో చికిత్స పొందుతున్న రాజేశ్వరి, ఆమె కుమారుడు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న అహ్మద్ గౌస్, అమీర్‌బీ

కంభం: వేగంగా వెళ్తున్న ఓ కారు ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఒకరు మృతి చెందగా మరో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక పాలిటెక్నికల్ కళాశాల ఎదురుగా అనంతపురం– అమరావతి హైవే రోడ్డు పై గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కందులాపురం గ్రామానికి చెందిన సోముల సుబ్బారెడ్డి (45) గురువారం మధ్యాహ్నం పొలంలో దున్నుతున్న వ్యక్తికి భోజనం తీసుకొని వెళ్తుండగా అదే సమయంలో విజయవాడ నుంచి గిద్దలూరు వెళ్తున్న కారు పాలిటెక్నికల్ కళాశాల సమీపంలో వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోముల సుబ్బారెడ్డికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కాలు కొంత భాగం తెగి కొంత దూరంలో పడింది. వేగంగా వస్తున్న కారు సుబ్బారెడ్డి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి అదుపు తప్పి వెనుక నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి హైవే రోడ్డుకు పక్కనే ఓ చెట్టును కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు, ద్విచక్రవాహనం నుజ్జునుజ్జై పోయాయి. గిద్దలూరుకు చెందిన మాజీ సైనికుడు వీరకుమార్ గిద్దలూరులో ఉన్న తల్లిదండ్రులతో కలిసి తిరుపతికి వెళ్లేందుకు భార్య పిల్లలతో కలిసి విజయవాడ నుంచి గిద్దలూరు బయలు దేరగా కంభంలో ప్రమాదం జరిగింది. కారులో ఉన్న అతని భార్య రాజేశ్వరి, వీరజితేష్, విరాట్‌కు గాయాలు కాగా కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మరో ద్విచక్రవాహనంపై వస్తున్న బేస్తవారిపేటకు చెందిన అహ్మద్ గౌస్, అమీర్‌బీలకు నడుముకు గాయాలు కాగా వారికి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించారు. మృతి చెందిన సుబ్బారెడ్డి వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సచివాలయ కన్వీనర్‌గా ఉన్నాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. రోడ్డు ప్రమాదం వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని భోరున విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు భారీగా ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో అటువైపుగా వెళ్తున్న మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా వెంటనే అధికారులకు సమాచారం అందించి క్షతగాత్రులను వైద్యశాలకు పంపించే ఏర్పాటు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బంధువుల రోదనలు కలచివేశాయి.

మార్కాపురానికి తాగునీటి ముప్పు..!

● వారంలో ఖాళీ కానున్న దూపాడు ఎస్ఎస్ ట్యాంక్
● 14 డీప్‌బోర్లతో నీటి సరఫరా



మార్కాపురం పట్టణం వ్యూ



నీటి లెవల్ చూపుతున్న ఎస్ఎస్ ట్యాంక్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణానికి తాగునీటి ముప్పు పొంచి ఉంది. వారం రోజుల్లో దూపాడు ఎస్ఎస్ ట్యాంకు ఖాళీ కానుండటంతో ఆందోళన నెలకొంది. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు దూపాడు నుంచి అందిస్తున్న సాగర్ జలాలు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌లో 70 మిలియన్ లీటర్లు మాత్రమే నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇవి మరో వారం రోజులు మాత్రమే ఉపయోగించుకోవచ్చు. పట్టణంలో ప్రస్తుతం నాలుగు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. వర్షాలు కురవక పట్టణంలో భూగర్భజలాలు అడుగంటి పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న వీధి బోర్లలో నీరు కూడా సరిగా రాకపోవడంతో నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. 35 వార్డులు ఉన్న పట్టణంలో సుమారు 19 వేల కుటుంబాలు ఉన్నాయి. పట్టణ జనాభాకు ప్రతి రోజు 80వేల లీటర్ల నీరు అవసరం ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. 190 డీప్ బోర్లు ఉండగా, ఇప్పటికే కొన్ని బోర్లలో నీరు అడుగంటిపోవడంతో అరకొర మాత్రమే వస్తున్నాయి. పట్టణంలో సుమారు 20 వార్డుల్లో నీటి సమస్య ఉన్నట్లుగా అధికారులు గుర్తించి ప్రత్యామ్నాయ మార్గంగా ట్యాంకర్లను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సాగర్ నీరు ఆగిపోతే తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చుతుంది. వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి బోర్లలో నీరందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆదుకుంటున్న డీప్‌బోర్లు

దూపాడు సాగర్ నీటితో పాటు, గతంలో చెరువులో వేసిన 10 బోర్లు, గుండ్లకమ్మ వద్ద వేసిన 4 బోర్లతో నీటిని పంప్‌హౌస్‌కు తరలించి ప్రజలకు నీటిని అందిస్తున్నారు. ఎస్ఎస్ ట్యాంక్‌లో సాగర్‌నీరు 70 మిలియన్ లీటర్లు ఉంది. ఆ డీప్‌బోర్లు కూడా అడుగంటిపోయే పరిస్థితి ఏర్పడితే పట్టణ ప్రజలకు నీరు సరఫరా చేసే మార్గాలు అన్వేషిస్తున్నారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి కృష్ణాజలాలు దూపాడు ఎస్ఎస్ ట్యాంక్‌కు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు. అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

వారం రోజులకు సరిపడా సాగర్ జలాలు



దూపాడు ఎస్ఎస్ ట్యాంక్‌లో వారం రోజులకు సరిపడే నీరు మాత్రమే ఉంది. నీటి సమస్య రావడంతో పట్టణ ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– కిరణ్, మున్సిపల్ కమిషనర్

పొగాకు అత్యధిక ధర కేజీ రూ.362



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ. 362కు వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేశారు. ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం, పాలేటిపాడు, జయవరం గ్రామాలకు చెందిన రైతులు 1146 బేళ్ళను వేలాని తీసుకురాగా వాటిలో 1108 కొనుగోలు జరిగ్గా, 38 బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 362 పలకగా, కనిష్ట ధర రూ. 205 పలికింది. సరాసరి రూ. 305. 70 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 41 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

త్రిపురాంతకం: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం 137 బస్తాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలోని రైస్‌మిల్లులో అధికారులు దాడులు చేసి బియ్యం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ గోడౌన్‌కు తరలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్‌సప్లై, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చుక్కల దుప్పి మృతి



మృతిచెందిన చుక్కల దుప్పి

జే.పంగులూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతిచెందిన సంఘటన బాపట్ల జిల్లా జే.పంగులూరు మండల పరిధిలోని కశ్యాపురం గ్రామ శివారులో అద్దంకి రోడ్డు మార్గంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. రేణింగవరం పోలీసులు ఆ మేరకు అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఏ శ్రీనివాసరావు, శిక్షణ అధికారి వై.జస్సన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడికి సమీపంలో జింక కళేబరాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో భగవాన్ రాజుపాలెం వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు చుక్కల దుప్పులు చనిపోయాయన్నారు. వాహన చోదకలు గమనించి చుక్కల దుప్పులు తిరిగే ప్రాంతాలలో వాహనాలు జాగ్రత్తగా నడపాలని కోరారు. జాతీయ రహదారికి దక్షిణం వైపు ఎక్కువగా సుబాబుల్ తోటలు ఉండటం వలన చుక్కల దుప్పులు సంచరిస్తున్నాయన్నారు. వీటికి ఎవరైనా ఉద్దేశపూర్వకంగా హాని తలపెడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉర్దూ పోస్టులు భర్తీ చేయాలి

● కలెక్టర్‌కు ముస్లిం సంక్షేమ సంఘం విజ్ఞప్తి



కలెక్టర్‌కు ముస్లిం స్వాతంత్య్ర పోరాట యోధుల చరిత్ర పుస్తకాన్ని అందిస్తున్న నేతలు

ఒంగోలు టౌన్: జిల్లాలో ఉర్దూ పోస్టులు భర్తీ చేయాలని పలువురు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విజ్ఞప్తి చేశారు. సెకండరీ గ్రేడ్ పోస్టులు 23, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 6 ఖాళీలుండగా.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ–2024 నోటిఫికేషన్‌లో ఉర్దూ జీఎస్టీ, ఉర్దూ ఎస్ఏ పోస్టులను ప్రకటించలేదని తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని ముస్లిం సంక్షేమ సంఘం, ఇన్సాఫ్, ఎస్డీపీఎఫ్ నాయకులు గురువారం కలెక్టర్‌కు విన్నవించారు.

అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఒక్క పోస్టు కూడా నోటిఫికేషన్‌లో పొందుపరచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు, ప్రభుత్వం ఉర్దూ మాధ్యమం పట్ల చిన్నచూపు చూస్తున్నారని, జిల్లాలో 30 ఉర్దూ పోస్టులు ఖాళీలుండగా ఉర్దూ మాధ్యమంలో బీఈడీ, డీఈడీ చదువుకున్న విద్యార్థులు వేలల్లో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం అలాగే ఒంగోలు నగరంలోని ముస్లింలకు శ్మశాన వాటిక కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ మహబూబ్, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ సాలార్, ముస్లిం హక్కుల సంఘం నాయకులు హాజీ ఖాశీం, షేక్ బాషా, సయ్యద్ నాగుర్, షేక్ ఫక్రుద్దీన్, షేక్ సత్తార్ ఉన్నారు. తొలుత కలెక్టర్‌కు ముస్లిం స్వాతంత్య్ర పోరాట యోధుల ఆల్బం బహూకరించారు.

భూగర్భ జలాలు పెంపొందించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



కొణిజేడులో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

టంగుటూరు: భూగర్భ జలాలు పెంపొందించే పనులు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మండలంలోని కొణిజేడు గ్రామంలో కలెక్టర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డ్వామా ఆధ్వర్యంలో వాటర్‌షెడ్ పథకంలో కింద గ్రామంలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఎంత విస్తీర్ణంలో పనులు చేపట్టారు, ఎంత ఖర్చు చేశారు. ఈ పనుల ద్వారా కలిగే ప్రయోజనాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని చెరువును కూడా పరిశీలించి ప్లాంటేషన్లో భాగంగా మొక్కలను నాటారు. నాగార్జునసాగర్ కాలువ ద్వారా ఈ చెరువుకు నీటి కేటాయింపులు జరిగేలా చూడాలని స్థానికులు కోరగా, ఈ విషయమై అర్జీ ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్ పనితీరును పరిశీలించారు. డ్వామా పీడీ బి. అర్జునరావు, వాటర్ షెడ్ అదనపు పీడీ వండర్ మ్యాన్, ఏపీడీ వెంకటస్వామి, తహసీల్దార్ కుటుంబరావు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఏపీఓ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

స్పందన భవనం పేరు మార్పు



ప్రకాశంభవనం ప్రాంగణంలో ఉన్న స్పందన భవనం పేరు మారుస్తున్న దృశ్యం

● ప్రజా సమస్యల పరిష్కార వేదికగా బోర్డు మార్పు

ఒంగోలు అర్బన్: ప్రకాశం భవనం ప్రాంగణంలో స్పందన భవనం పేరు మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి కలెక్టర్ పోలా భాస్కర్ ప్రజల సమస్యలు పరిష్కారం చేసేందుకు గ్రీవెన్స్ నిర్వహించేందుకు, అధికారులతో సమావేశాలు నిర్వహించుకునేందుకు, అధికారులు, ఉద్యోగులు పదవీ విరమణ కార్యక్రమాలు, ఇతర ప్రభుత్వ పరమైన కార్యక్రమాలు నిర్వహించేదుకు దాదాపుగా 500మందికి పైగా పట్టేలా నిర్మాణం చేపట్టి దానికి ‘స్పందన భవనం’గా నామకరణం చేశారు. ఆ భవనం ఎంతగానో ఉపయోగపడటంతో పాటు అధికారులు, ఉద్యోగులు, ప్రజల్లో ప్రాచుర్యం పొందింది. అయితే కూటమి ప్రభుత్వ రాగానే ఆ భవనం పేరును స్పందనగా తొలగించి ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మార్పు చేస్తూ బోర్డును ఏర్పాటు చేసారు. అయితే గతంలో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ‘స్పందన’ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనే పేరుతో ప్రజల గ్రీవెన్స్‌ను నిర్వహించింది. ఇప్పుడు స్పందన తొలగించి కేవలం ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుతో గ్రీవెన్స్ నిర్వహించడం, అదే పేరును స్పందన భవనానికి మార్చడం గమనార్హం. అయితే ప్రకాశంభవనంలో వివిధ శాఖల కార్యాలయాలు ఉన్నాయి. వాటిలో పనిచేసే ఉద్యోగులు పేరు మార్చడం అనైతికమని స్పందన భవనం పేరు సాధారణ ప్రజలు సైతం గుర్తించేలా అలవాటైందని, దాన్ని ఇప్పుడు పేరు మార్చినా బోర్డు మారుతుందే తప్ప స్పందన భవనంగానే ప్రజలకు తెలుసని, అధికారం ఉంటే ఇటువంటి పనులు చేయడం సరికాదని గుసగుసలాడుతున్నారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య



మృతి చెందిన రవణమ్మ

గిద్దలూరు రూరల్: తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన పట్టణంలోని కొంగలవీడురోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బోయినపల్లె రమణమ్మ(15) పదో తరగతి చదువుతోంది. ఒక యువకుడితో సన్నిహితంగా మాట్లాడుతుందని గమనించిన తల్లి వెంకటరంగమ్మ మందలించి రవణమ్మకు పెళ్లి సంబంధం చూస్తానని చెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన రమణమ్మ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో విగతజీవిగా పడి ఉన్న కూతురు రవణమ్మ మృతదేహాన్ని చూసిన తల్లి పెద్ద ఎత్తున విలపించింది. సమాచారం అందుకున్న సీఐ వైవీ సోమయ్య సంఘటనా స్థలానికి చేరుకొని రమణమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లి వెంకటరంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.